క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి



విద్యార్థులకు కరాటే దుస్తులు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో కూడా రాణించి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఏబీ చారిటబుల్ ట్రస్ట్, జై హనుమాన్ అశ్విని మార్షల్ ఆర్ట్ స్పోర్ట్స్ అకాడమీ, సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీల ఆధ్వర్యంలో స్థానిక ప్రదీప్ నగర్‌లో ఉన్న కరాటే అకాడమీలో విద్యార్థులకు ఉచిత కరాటే దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మరక్షణ టెక్నిక్స్ నేర్చుకోవడం చాలా మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటూ క్రీడా రంగాల్లో దూసుకుపోవాలన్నారు. కరాటే విద్య నేర్చుకోవడం ద్వారా తనకు తాను ఆత్మరక్షణగా ఉండడంతో పాటూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కూరెళ్ల శ్రీనివాస్, అకాడమీ ప్రతినిధులు డాక్టర్ ఎమ్.ఎస్.స్వరూప్, పెంకి అశ్విని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జొన్నాడ రూరల్ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ జి.సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. కృష్ణాపురం, రఘుమండ, జొన్నాడ, దువ్వపేట, గొలగానిపేట, ఆకులపేట, డి.తాళ్లవలస గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

బొబ్బిలి: పట్టణంలోని దాడితల్లి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి, సుబ్రహ్మణ్య స్వామికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కళాకారులకు సత్కారం



సత్కారాలు పొందిన కళాకారులతో నిర్వాహకులు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో సోమరాజు స్మారక నిధి అధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తూముల అచ్యుతవల్లి ఆధ్వర్యంలో పలువురు కళాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో కళాసేవ చేస్తున్న కె.బాబూరావు, బొంతలకోటి శంకరరావు, బారు వెంకటరమణ, తేలు శ్రీనివాసరావులను సముచిత రీతిన సత్కరించారు. శ్రీకళాభారతి అధ్యక్షుడు సిద్ధా సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, పుల్లెల శ్రీనివాసరావు, మాటూరి విజయలక్ష్మి, బొమ్మినాయుని తిరుపతిరావు, ధూపం వాసు, అలమండ రామమూర్తి, దాసరి వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రాజాం సిటీ: పట్టణంలోని కస్పావీధిలో స్థానిక వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 130 మంది మహిళలు పాల్గొని వీధిని రంగవల్లులతో తెలుగుదనం ఉట్టిపడేలా అందంగా అలంకరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చలపాక మౌనిక, బి.మౌనిక, కె.పుష్పలతలకు ప్రముఖ వైద్యాధికారి గార సూర్యశైలజ చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.లక్ష్మి, మాధవి, పద్మశ్రీ, ప్రసన్న, వాకచర్ల మణి, మాధురిలు వ్యవహరించారని వికాసతరంగిణి అధ్యక్షులు టీటీవీ రమణమూర్తి తెలిపారు.

సీహెచ్ అగ్రహారంలో అభివృద్ధి పరుగులు



సీహెచ్ అగ్రహారంలో నిర్మించిన సచివాలయం



సీహెచ్ అగ్రహారంలో నిర్మించిన డ్రైనేజీ

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. మండలంలోని సిహెచ్.అగ్రహారంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కృషితో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఎంతో కాలంగా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న గ్రామ వాసులకు డ్రైనేజీలు, సీసీ రహదారులు, తాగునీటి కుళాయిలు వేయడంతో పాటు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెల్‌నెస్ కేంద్రం



సీహెచ్ అగ్రహారంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

అభివృద్ధి ఇలా...

ఎంతో కాలంగా మురుగునీరు ఇళ్ల వద్దనే నిల్వ వుండిపోవడంతో పాత అగ్రహారం వాసులు ఇబ్బంది పడ్డారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడంతో సుమారు 30 లక్షల రుపాయిలతో డ్రైనేజీ నిర్మాణం జరిగింది. మెయిన్‌వీధి, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక దశాబ్దాలుగా ఇబ్బంది పడటంతో దీనిని గుర్తించిన ఎమ్మెల్యే సుమారు 5 లక్షల రుపాయిలు మంజూరు చేయడంతో డ్రైనేజీకి నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేశారు. సిహెచ్.అగ్రహారం ఎస్సి కాలనీ నుంచి శ్మశానం వరకు సుమారు రూ.22 లక్షలతో సీసీ రహదారి మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేశారు. గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను సుమారు రూ.82 లక్షలు నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తి చేశారు. సిహెచ్.అగ్రహారం పరిధిలో డీబీటీ, నాన్‌డీబీటీ కింద వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 58 నెలల కాలంలో సుమారు రూ.50 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో అభివృద్ధి పరుగులు పెట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామంలో సీసీ రహదారి

రామతీర్థంలో వైభవంగా ఉగాది వేడుకలు



నెల్లిమర్ల రూరల్: పంచాగ పఠన కర్త నారాయణ శర్మను సన్మానిస్తున్న ఈఓ శ్రీనివాసరావు



నెల్లిమర్ల రూరల్: స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కొండగుంపాంలో పంచాంగం వింటున్న ప్రజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఉగాది శోభ వెల్లివిరిసింది. కొత్త ఏడాది కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, తదితరులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. సాయంత్రం 6 గంటల నుంచి స్వామి సన్నిధిలో విజయనగరం పట్టణానికి చెందిన నారాయణ శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో శుభాలు, రైతుల వృద్ధి, ఎంత మోతాదులో వర్షాలు కురుస్తాయన్న వివరాలను తెలియజేశారు. వివిధ నక్షత్రాలు, రాశులకు చెందిన వారు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పండగ

డెంకాడ: మండల వ్యాప్తంగా ఉగాది పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెలుగు నామ సంవత్సరమైన క్రోధి నామ సంవత్సరానికి ప్రజలు ఆనందంగా ఆహ్వానం పలికారు. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా సాంప్రదాయ వస్త్ర ధారణలతో ఆకట్టుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లోను, ఆలయాల్లో ఉగాది పంచాంగాన్ని ఆయా గ్రామాల పురోహితులు చదివి వినిపించారు.

వాడవాడలా పంచాంగ శ్రవణాలు

పూసపాటిరేగ: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం పంచాంగ శ్రవణాలు జరిగాయి. ఆయా గ్రామాల పరిధిలో వేద పండితులు పంచాంగ శ్రవణాలు చదివి వినించారు. పూసపాటిరేగ, పేరాపురం, చినపతివాడ, పెదపతివాడ, వెంపడాం, రెల్లివలస, కుమిలి గ్రామాలతో పాటు అన్ని గ్రామాలలోను పంచాంగ శ్రవణాలు జరిగాయి.

రామనారాయణంలో...

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని కలశ స్థాపన పూజ, ఇవటూరి నారాయణశర్మతో శ్రీమద్రామాయణంపై పారాయణం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, స్వర్ణ పుష్పాలతో విశేష అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కొత్త ఏడాది కావడంతో వేకువజామున ఆయా గ్రామాల్లో ప్రజలు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలే కలగాలని పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో రామ మందిరాలు, రచ్చబండ వద్ద పురోహితుల సమక్షంలో పంచాంగాన్ని చూపించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు, పంటలు ఎలా ఉంటాయోనని అడిగి తెలుసుకున్నారు. అంతా ఒకే చోట చేరడంతో పల్లెలు కలకలలాడాయి.

వేదవాఙ్మయం.. పరాశక్తి స్వరూపం

- ఘనంగా వాగ్దేవి సమారాధనం వార్షికోత్సవం



వాగ్దేవి కళాయశస్వి బిరుదు అందుకుంటున్న ధవళ సర్వేశ్వరరావు

విజయనగరం టౌన్: వేద వాఙ్మయం పరాశక్తి స్వరూపమని ఆధ్యాత్మిక శిరోమణి బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాలశాస్త్రి పేర్కొన్నారు. నగరంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం మేడపైన ఉన్న చా.సో. భవనంలో మంగళవారం వాగ్దేవి సమారాధనం సంస్థ నాలుగవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆధ్వర్యంలో జిల్లాలో సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక, కళా, పత్రిక, సేవా రంగాల్లో నిష్ణాతులైన వారిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, సామాజికవేత్త ధవళ సర్వేశ్వరరావుకు వాగ్దేవి కళాయశస్వి బిరుదును ప్రధానం చేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాలశాస్త్రి మాట్లాడుతూ అమ్మను మమ్మీగా అని దెయ్యంగా భావించి పిలిచే సంస్కృతి నుంచి బయటపడాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు పూజించబడే మన దేశ సంస్కృతి ఎంతో ఉన్నతమైనదని, ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల వెంకట నాగప్రభాకర శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త జక్కు రామకృష్ణ, రుగ్వేద పండితులు రాంభట్ల సన్యాసిరాజు శర్మ, కందాల లక్ష్మి, దూసి కృష్ణమూర్తి, చింతలపూడి త్రినాథరావు తదితరులను సత్కరించారు. మంజూష శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జెబి.తిరుమలాచార్యులు, భోగరాజు సూర్యలక్ష్మి, ముళ్లపూడి సుభద్రాదేవి, సంస్థ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైడితల్లి సన్నిధానంలో పంచాంగ శ్రవణం



రామసుబ్బారావును ఘనంగా సత్కరిస్తున్న ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి సన్నిధానంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేత్రత్వంలో నిర్వహించారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో బ్రహ్మశ్రీ రామసుబ్బారావు పంచాంగ శ్రవణం చేశారు. అదేవిధంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న అమ్మవారి వనంగుడిలో వేదపండితులు సాయికిరణ్ పంచాంగ శ్రవణం చేశారు. పాడిపంటలు, అభివృద్ధి, చేయకూడని పనులు వివరించారు. అనంతరం ఆలయ ఈఓ వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏడుకొండలు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రోధి నామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి



ఉగాది సందర్భంగా కోలగట్ల నివాసంలో పంచాంగ శ్రవణం చెబుతున్న సాంబశివశాస్త్రి

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది ప్రారంభం నుంచి ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తన నివాస గృహంలో మంగళవారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ సాంబ శివ శాస్త్రి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. వివిధ రాశుల వారి ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను వెల్లడించారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో అనుకున్న సమయానికి వర్షాలు కురుస్తాయని, పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి నేత్రత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించే శుభ ఘడియలు ఉన్నాయన్నారు. మొత్తమ్మీద శ్రీక్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి.రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రేగిడి: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్సై ఇ.శ్రీనివాసరావు కోరారు. మండలంలో చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం, వండానపేట తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓటు హక్కు వినియోగంపై ప్రలజకు అవగాహన కలిపించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా, మద్యం, గుట్కా, పాన్ వంటి మత్తు పదార్థాలు విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యా ప్రధాత అల్లూరి మూర్తిరాజు



అల్లూరి మూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ సత్యనారాయణరాజు తదితరులు

- మిమ్స్ చైర్మన్ సత్యనారాయణరాజు

నెల్లిమర్ల: మిమ్స్ వైద్య కళాశాల వ్యవస్థాపకుడు, దివంగత అల్లూరి మూర్తిరాజు విద్యాప్రధాత అని, ఆయన కుమారుడు, మిమ్స్ మెడికల్ కళాశాల చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు(బాబీ) అన్నారు. దివంగత మూర్తిరాజు జయంతి వేడుకలను మిమ్స్ క్యాంపస్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ సత్యనారాయణతో పాటు మిమ్స్ యాజమాన్య ప్రతినిధులు, పలువురు ఉద్యోగులు ముందుగా మూర్తిరాజు సమాధిని దర్శించుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్యాంపస్‌లోని దివంగత మూర్తిరాజు విగ్రహం వద్ద ఆయన చిత్ర పటం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలతో పాటు రాష్ట్రేతర ప్రాంతాల్లో ఎన్నో విద్యా సంస్థలను ఏర్పాటు చేసి విద్యాసేవ చేసిన ఘనత మూర్తిరాజుకే దక్కుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే తొలి ప్రైవేటు వైద్యకళాశాల మిమ్స్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు వైద్య విద్య అందించారని అన్నారు. మిమ్స్‌ను అన్ని రంగాల్లో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మూర్తిరాజు మేనల్లుడు జివిఎస్ఎన్.వర్మతో పాటు మిమ్స్ వైద్య కళాశాల ఉన్నత స్థాయి ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం తెలుగుకాలమానిని ఆవిష్కరణ




తెలుగు కాలమానిని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంతం క్రోధినామ సంవత్సర తెలుగు కాలమానిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో చైత్ర మాసంతో ప్రారంభమయ్యే క్యాలెండర్ ఉండడం మన అదృష్టమన్నారు. పూర్వం నుంచి ఇదేవిధంగా తెలుగువారికి కాలమానిని ఉండేదని, మరలా ఇప్పుడు ప్రబోధానంద యోగీశ్వరులు దయవలన మనకు ఆ రోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు రాజప్పుడు, దుర్గారావు, సూరిబాబు, రాము, సుబ్రహ్మణ్యం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి బాటలోనే నడుస్తా..

- వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్చార్జ్ విక్రమ్



అవనాపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విక్రమ్, భావన దంపతులు

విజయనగరం టౌన్: ప్రముఖ వ్యాపారవేత్త, సేవాతత్పరులు, విజయనగరం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ దివంగత అవనాపు సూరిబాబు 12వ వర్ధంతిని మంగళవారం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్చార్జ్ అవనాపు విక్రమ్ కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి ఘన నివాళులర్పించారు. అవనాపు సూరిబాబు చిత్రపటానికి పూలమాలలేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. తన తండ్రి ఆశయాల బాటలోనే తాము నడుస్తున్నామన్నారు. తన తండ్రి సూరిబాబు, పెదనాన్న అప్పలనాయుడుల జ్ఞాపకార్థం ఈ ఏడాది నాగవంశ సంక్షేమ సంఘానికి అంతిమయాత్ర వాహనాన్ని తాను, తన సోదరుడు విజయ్‌తో కలిసి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అవనాపు విక్రమ్ సతీమణి, జిల్లా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.